శ్రీవారి ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

బీర్కూర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని అమ్మవార్లను శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పలువురు భక్తులు నిత్యాన్నదాన కార్యక్రమం కోసం విరాళాలు అందజేశారు. దాతలకు కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇదిలా ఉండగా ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



లింగ నిర్ధారణపై.. నిఘా!

- తనిఖీలకు సిద్ధమవుతున్న అడ్వైజరీ కమిటీ
- అనుమతిలేని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక దృష్టి
- పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ గురించి వివరించనున్న యంత్రాంగం
- ఇప్పటికే లింగ నిర్ధారణ చేస్తున్నారనే వాటిపై నిఘా
- జిల్లాలో 42 స్కానింగ్ సెంటర్లు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంతో పాటు ఇతర మండల కేంద్రాల్లో లింగ నిర్ధారణ గుట్టుచప్పుడు కాకుండా చేయడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖతో పాటు పోలీసుశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి పలువురిపై కేసులు నమోదు చేస్తూ వచ్చారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా భ్రూణహత్యలు, ఆడపిల్ల అని స్కానింగ్‌లో తెలిస్తే చాలు వద్దనుకుంటున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుందని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఈ చర్యలకు స్వస్తి చెప్పాలని భావించి ప్రతీ జిల్లాలో అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా గత నాలుగు రోజుల కిందట జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ అనుమతితో కొనసాగుతున్న స్కానింగ్ సెంటర్లను తనిఖీలో భాగంగా నిర్వాహకులకు పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ -1994 గురించి వివరించాలని నిర్ణయించారు. గర్భంలో ఉన్న శిశువు మగ బిడ్డ.. ఆడ బిడ్డ అని తెలుసుకునేందుకు కొంతమంది లింగ నిర్ధారణ పరీక్షలకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటి, రెండో కాన్పుల్లో ఆడ బిడ్డలు పుట్టిన తర్వాత మగ బిడ్డ కోసం ముందస్తుగా లింగ నిర్ధారణ చేసుకుంటున్నారు. బేటీ బచావో - బేటీ పడావో కింద లింగ నిర్ధారణ నేరం అనే విషయాన్ని తెలియజేసేందుకు జిల్లా అడ్వైజరీ కమిటీ సిద్ధమవుతోంది.

విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు

గతంలో జిల్లాలోని కామారెడ్డి పట్టణ, రాజంపేట మండల కేంద్రాల్లో పలు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నట్లు ఫిర్యాదు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖలు తనిఖీలు చేపట్టి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తేలడంతో ఆయా ప్రాంతాల్లోని నిర్వాహకులపై కేసులు నమోదు చేసి మిషన్‌లను స్వాధీనం చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం కూడా జిల్లాలో మరికొన్నిచోట్ల లింగ నిర్ధారణ పరీక్షలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనుమతి ఉన్న స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు జిల్లాలోని కొన్ని మండల కేంద్రాల్లో ఉన్న క్లీనిక్‌లకు మొబైల్ మిషన్‌లు తీసుకెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు మళ్లీ మొదలుపెట్టినట్లు ప్రచారంలో ఉంది. ఇందుకు గాను ఒక్కొక్కరి నుంచి వేలల్లోనే డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖాధికారులు కేసులు నమోదు చేసిన ఆయా స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు వారి దందాను కొద్ది రోజులు మాత్రమే నిలిపివేసి మరో ప్రాంతాల్లో లింగ నిర్ధారణ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారనే వాదనలు లేకపోలేదు.

నిబంధనలు అతిక్రమిస్తున్న వాటిపై నిఘా

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్‌లు 42 వరకు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 37 వరకు స్కానింగ్ సెంటర్‌లు పని చేస్తున్నట్లు సమాచారం. కాగా అనుమతి లేకుండా చాలా చోట్ల స్కానింగ్ సెంటర్‌లు నడుస్తుండడంతో అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టడంతో కొందరు అనుమతులకు సైతం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమిస్తున్న వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా అడ్వైజరీ కమిటీ సిద్ధమవుతోంది. పని చేయని స్కానింగ్ సెంటర్‌లు సైతం వాస్తవంగా అవి పనిచేస్తున్నాయా లేదా అనేది తెలుసుకునేందుకు తనిఖీలు చేయనున్నారు. ప్రధానంగా కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రాల్లోని స్కానింగ్ సెంటర్‌లతో పాటు గతంలో పలు ఫిర్యాదులు వచ్చిన స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అనుమతులు ఉన్న స్కానింగ్ సెంటర్లలో వైద్యుల సలహా మేరకు మాత్రమే స్కానింగ్ సెంటర్‌కు సాధారణ పరీక్షల కోసం వెళ్లారా లేదా మరో కారణంగా వెళ్లారా అనే విషయాలపై ఆరా తీయనున్నారు.


వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమావేశమైన అడ్వైజరీ కమిటీ


బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద టపాకాయలు కాలుస్తున్న నాయకులు

ఢిల్లీలో బీజేపీ విజయంతో..

జిల్లాలో నాయకుల సంబరాలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించడంతో బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు టపాకాయాలు కాల్చి, మిఠాయిలు తినిపించుకుని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీజేపీ విధానాలతో అన్ని రాష్ట్రాల్లో బీజేపీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, వేణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ 27 సంవత్సరాల తర్వాత దేశ రాజధానిలో బీజేపీ జెండాను ఎగరవేయడం జరిగిందని, దేశంలో ఎక్కడా ఎలక్షన్లు నిర్వహించిన బీజేపీ పట్ల ప్రజలు విశ్వాసంతో ఓట్లు వేసి బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి గంగారెడ్డి, చిరంజీవి, శంకర్‌గౌడ్, చిదర సాయిలు, లక్ష్మీనారాయణ, చీకట్ల రాజు, వెంకట్, ఉమేష్, సిద్ధార్థ అశ్విన్, శంకర్, భాస్కర్‌రెడ్డి, అరుణ్ కుమార్, సుధాకర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడలో..

ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల దృష్ట్యా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 27న ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఎన్నికల కోసం కేటాయించిన సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని శిక్షణ తరగతుల్లో తెలిపిన ప్రకారంగా విధులకు హాజరుకావాలని తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని, ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు ఆయా సామగ్రిని తీసుకుని పరిశీలించికొని, కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసిన వాహనాల్లో వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తదుపరి ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ సిబ్బంది ఏజెంట్లకు సీటింగ్ ఏర్పాట్లు, సీక్రెట్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించాలని బ్యాలెట్ బాక్స్‌లకు సీలింగ్ వేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు బయటి వ్యక్తులు ఎవరిని కూడా అనుమతించకూడదని, 200 మీటర్ల లోపు ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. ప్రతీ 2 గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు ప్రకటించాలని సూచించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ప్రిసైడింగ్ అధికారి డైరీ సిద్ధం చేయాలని, అన్ని రిపోర్టులతో పాటు సీల్ వేసిన బ్యాలెట్ బాక్స్‌లను రిసెప్షన్ కౌంటర్‌లో అందజేయాలని తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరుకాని ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీవో రాజారాం, శిక్షకులు రామకృష్ణ, లక్ష్మణ్, ఆర్డీవో ప్రభాకర్, డీఆర్డీవో పీడీ సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


డీఈవో రాజుకు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉన్న, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, డీఈవో రాజును శనివారం ఉపాధ్యాయ సంఘాల సమైక్య సభ్యులు కోరారు. ఈ సందర్భంగా సమాఖ్య చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో సస్పెండ్ అయిన ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని, మధ్యాహ్న భోజనంలో భాగంగా ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు తప్పించాలని అన్నారు. కులగణన చేసిన ఉపాధ్యాయులకు త్వరగా రెమ్యూనరేషన్ ఇవ్వాలని, ఎంఈవోలకు తెలియకుండా ఏసీజీఈ, సీఎస్ నవోదయ, ఓపెన్ టెన్త్, ఇతర పోటీ పరీక్షల్లో ఇన్విజిలేటర్లను సొంత మండలంలో ఉన్న ఉపాధ్యాయులను కాకుండా వేరే మండలంలోని ఉన్న ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా డ్యూటీలు వేసుకుంటున్నారని అన్నారు. ఇన్విజిలేషన్ విధులు పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. ఏపీసీ పనులు పూర్తి అయినా చాలా మండలాల్లో ఇంజనీరింగ్ అధికారులు ఎంబీ రికార్డులు చేయడంలో జాప్యం చేస్తున్నారని బిల్లులు చెల్లించడం లేదని వెంటనే బిల్లులు చెల్లించేలా చూడాలని అన్నారు. ఎస్ఎస్‌సీ పరీక్షల్లో డ్యూటీలు పారదర్శకంగా వేయాలని స్థానిక ఎన్నికల్లో కొన్ని ఉపాధ్యాయసంఘాల జిల్లా నాయకులకు ఎన్నికల డ్యూటీలు వేయరు కానీ రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉన్న టీచర్‌లకు, పీహెచ్‌సీ టీచర్‌లకు క్యారింగ్ మహిళ ఉపాధ్యాయులను ఎన్నికల్లో విధులు అప్పగిస్తారని దీనిని నియంత్రించాలని అన్నారు. మార్చి నెలలో రంజాన్ ఉపవాస దీక్షలు ఉండడం వల్ల ముస్లిం టీచర్‌లకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కుంటరాములు, కోశాధికారి పందిరి రాజేష్, సంయుక్త కార్యదర్శులు అయ్యాల సంతోష్, గఫూర్ శిక్షక్, ముజిబొద్దీన్, ప్రభాకర్, గోపాల్, రాములు, స్వామి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో గ్రామాలు

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వస్తున్న ప్రజలు
- ఏర్పాటుకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- కానీ సీసీ కెమెరాల నిర్వహణే అసలు సమస్య

భిక్కనూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గత నెలలో భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో తల్లీకొడుకు బైక్‌పై జంగంపల్లి వస్తుండగా ఇద్దరు అగంతకులు వారిని ఆటకాయించి తల్లి మెడలో నుంచి బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న భిక్కనూరు సర్కిల్ పోలీసులు భిక్కనూరు మండలంతో పాటుగా రాజంపేట మండలంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు మెదక్ జిల్లాకేంద్రం వైపు వెళ్లినట్లు గుర్తించి మెదక్ జిల్లా పోలీసులతో సమన్వయం చేసుకుని సీసీ కెమెరాలో రికార్డు అయిన వారు మెదక్ పట్టణానికి చెందిన వారుగా గుర్తించి వారిని పట్టుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. గత నెలలోనే భిక్కనూరు మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని తన భార్యే మరో నలుగురు వ్యక్తులతో కలిసి సంగారెడ్డి జిల్లాలో హత్య చేయగా అక్కడి సీసీ కెమెరాల్లో ఆ తతంగమంతా రికార్డు కాగా దాని ఆధారంగా పోలీసులు కేవలం రెండు రోజుల్లోనే కేసు ఛేదించి హత్య చేసిన మృతుడి భార్యతో పాటుగా భిక్కనూరు మండలానికి చెందిన నలుగురిని జైలుకు పంపారు. ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కానీ ప్రతీక్షణాన్ని సీసీ కెమెరాలో రికార్డు చేసేలా ఏర్పాట్లు చేస్తే దేనినైనా విశ్లేషించడం సులభతరమవుతుంది. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు చోటు చేసుకున్న సమయాల్లో పోలీసుల విచారణకు ఇలాంటి వీడియో రికార్డులు ఎంతగానో ఉపయోగపడుతుంటాయి. అందుకే అంటారు ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని. గ్రామాల్లో ఈ సీసీ కెమెరాల ఏర్పాటుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగానే గ్రామాల్లో సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ వాటి ఏర్పాటుకు ముందుకు సాగుతున్నారు.


కంచర్లలో ఇటీవల సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ చైతన్యారెడ్డి

వాటి నిర్వహణే అసలు సమస్య

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వరకు బాగానే ఉన్నా.. వాటి ఏర్పాటు అనంతరం వాటి నిర్వహణను పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇలా ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల ఏర్పాటు చేసిన కొన్ని రోజుల్లోనే మూలన పడుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో కోతులు ఈ సీసీ కెమెరాల కెబుల్ వైర్లను తెంపడం, సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం ప్రధాన సమస్య కాగా మరికొన్ని చోట్ల విద్యుత్ మరో సమస్య. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ సీసీ కెమెరాలను పోలీసులు కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.

గతంలో ఏర్పాటు చేసిన వాటిని పునరుద్ధరించాలని వేడుకోలు

గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన చాలా సీసీ కెమెరాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని. కానీ ఇదివరకే ఉన్న సీసీ కెమెరాలను తిరిగి పునరుద్ధరిస్తే చాలా వరకు డబ్బులను ఆదా చేయవచ్చు. చాలా గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలుండగా అలాంటి గ్రామాల్లో పోలీసులు శ్రద్ధ తీసుకుని వాటిని పునరుద్ధరించాలని వేడుకుంటున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం

• సంపత్‌కుమార్, సీఐ భిక్కనూరు

భిక్కనూరు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ముఖ్యంగా సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దీనితో పాటుగా సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసి ఇతరితర కారణాలతో పని చేయని సీసీ కెమెరాలను పునరుద్ధరించడంతో పాటుగా 44వ జాతీయ రహదారిపై యూ టర్న్‌ల వద్ద, ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న చోట, దాబాల వద్ద కొత్తగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. సీసీ కెమెరాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాలు ఎక్కడైనా పని చేయని యెడల తమ దృష్టికి తీసుకురావాలి.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.56 వేల చెక్కును కూశలక్ష్మీకి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కుమంజూరుకు కృషిచేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, మినుముల సాగర్, స్వామి, రాజు, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

విప్లవ ఉద్యమాలకు యాదగిరి పునాదులు వేశారు



సభలో మాట్లాడుతున్న బి.దేవరాం

మోర్తాడ్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విప్లవోద్యామ నిర్మాణానికి పునాదులు వేసిన మూలస్తంభం వంటివారు కామ్రేడ్ కర్లటి యాదగిరి మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం అన్నారు. శనివారం మోర్తాడ్‌లో కర్లటి యాదగిరి సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవరాం మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్ది అందరికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్, శర్మ, డివిజన్ నాయకులు కిషన్, అశోక్, ప్రజాసంఘాల నాయకులు దయాల్‌సింగ్, దశరథ్, పద్మ, రాజన్న, అంజలి ఉన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు

ముప్కాల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ ఆరుగురు బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గద్దల రమేష్, ఏలేటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఒలంపియాడ్‌కు విద్యార్థుల ఎంపిక



ఒలంపియాడ్‌కు ఎంపికైన విద్యార్థులు

ముప్కాల్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): గత నెల 3వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో ముప్కాల్ న్యూహరిజోన్ పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయికి ఎంపికైనట్లు న్యూహరిజోన్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రవిలాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులను కరస్పాండెంట్ రత్నాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నలంద పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్‌లో శనివారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ పట్టుదలతో చదివి పదోతరగతిలో 10 జీపీఏ సాధనకు కృషిచేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకొని చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తోటివిద్యార్థులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మంజీర సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకు నిస్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్కాల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబసమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బాల్కొండలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాల్కొండ మండల కేంద్రానికి చెందిన వేంపల్లి కృష్ణ అలియాస్ నర్సయ్య(46) శుక్రవారం తన వ్యవసాయ తోటలోకి వెళ్ళి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నర్సయ్యను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా రాత్రి 11 గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



తొర్లికొండలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొర్లికొండలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉత్సవాలను శనివారం భక్తులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. కొండపైకి చేరుకున్న భక్తులు స్వామివారి పల్లకిని ప్రదక్షిణ చేయించారు. కొండపై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి విత్తనాలు అందించాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతం విత్తనోత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉందని, దేశానికి విత్తనాలు అందించేస్థాయికి ఎదగాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శనివారం వేల్పూర్ మండలం విత్తన ధృవీకరణ కార్యాలయంలో విత్తన ధృవీకరణ, సేంద్రీ య ధృవీకరణపై రైతులకు, విత్తనోత్పత్తిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వివిధ పంటల ఉత్పత్తిలో పాటించాల్సిన మేళకువలను వివరించడంతో ధృవీకరించబడిన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడి పొందాలని సూచించారు. రాష్ట్రంలో విత్తనాలు తయారు చేసి అందిస్తున్న ఆ విత్తనాలు ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ధృవీకరించబడిందా లేదా అన్న విషయాన్ని రైతులు తెలుసుకొని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విత్తన



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

ధృవీకరణ, సేంద్రీయ ధృవీకారణ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు, బోర్డు సభ్యులు రొక్కం మురళీ, రాంచందర్, బోర్డు మాజీసభ్యులు సంజీవ్‌రెడ్డి, యూనివర్సిటీ సైంటిస్టులు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగాల్లో రాణించాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బోధన్ సబ్‌కలెక్టర్

బోధన్‌రూరల్,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక రంగాలలో రాణించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ పాఠశాల సిల్వర్‌జూబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి పట్టుదలతో చదివి మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తెచ్చి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్, విద్యావికాస్ శ్రీనివాస్, ఇల్తెపు శంకర్, సాలూర మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజూష, బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, లోల శంకర్, తహసీల్దార్ శశిభూషణ్, పాఠశాల యాజమాన్యం రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి జాతర ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 8 : (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కాలజ్ఞాని శ్రీమద్ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతర ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవమూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పల్లకి ఊరేగింపు గ్రామకమిటీ సభ్యులు గ్రామంలో ఊరేగిస్తూ జంబిహనుమాన్ ఆలయం వద్ద గల శ్రీగిరి గుట్టపైగల బ్రహ్మంగారి ఆలయానికి చేర్చారు. గ్రామ మహిళలు మంగళహారతులతో ముందు నడవగా మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పల్లకి ఊరేగింపు నిర్వహించారు.

విజయ్ ఫార్మసి విద్యార్థినికి మూడుస్వర్ణ పతకాలు

మాక్లూర్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానిక్‌బండార్ గ్రామ శివారులో గల విజయ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీకి చెందిన విద్యార్థిని జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవంలో భాగంగా విద్యార్థిని బొబ్బిలిశరణ్యకు మూడు స్వర్ణ పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ తెలిపారు. జేఎన్‌టీయూ టెట్ కళాశాల అన్నింటిలో ఉత్తమ ఔట్‌గోయింగ్, బీఫార్మసి అవార్డు, బీఫార్మసి కోర్సులో ఒకటోర్యాంకు సాధించి సాధాన్ ఎండోమెంట్ గోల్డ్‌మెడల్, విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో ఉత్తమ ఔట్‌గోయింగ్ బీఫార్మసి విద్యార్థిగా డాక్టర్ ఆంధ్రనాయుడు ఎండోమెంట్ గోల్డ్‌మెడల్ సాధించారు. అత్యుత్తమ విజయ సాధన అంకితభావం మూడుగోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థినికి కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి అమృతలత విద్యార్థులు అభినందించారు.

తడిపొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ సిబ్బంది శనివారం తడిపొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకోవడానికి ప్రతీఒక్కరు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు. అలాగే వీధికుక్కలతో జాగ్రత్తగా ఉండాలని, వాటితో ఏలా వ్యవహారించాలో విద్యార్థులకు అవ గాహన కల్పించి వాటి జనాభా నియంత్రణకు ఎనిమిల్ భర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలిస్తున్నామని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



పరీక్షప్యాడ్‌లతో విద్యార్థినులు

కోటగిరి, ఫిబ్రవరి 08 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎత్తొండ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శశాంక్ కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతో పాటు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, ఉపాధ్యాయులు అజయ్, నవీన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల, కళాశాలల సమస్యలు పరిష్కరిస్తాం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి నాలుగు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల, కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో ప్రైవేటు కళాశాల, పాఠశాలల టీచర్లతో సమావేశం నిర్వహించారు.

ఆర్మూర్‌రూరల్ : ఉపాధ్యాయ పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మొదటి సారి ఆయన ప్రచారం నిర్వహించారు.

పచ్చలనడ్కుడలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. పేదలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం గొప్పవరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్, నాయకులు గట్టువుతాల నర్సారెడ్డి, నెహ్రు, మోహన్, మండల భోజన్న, లింగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్షత్రీయ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ క్షత్రీయ కళాశాలలో శనివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు కళాశాలకు వెన్నుముక లాంటివారని, వారి పనితీరుపై పేరుప్రతిష్టాలు ఆధారపడి ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్ చాటర్జీ, గర్గిపాటి శ్రీనివాస్, రామసావిత్రి, లక్ష్మణచార్య, ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోను సన్మానించిన కలెక్టర్



ఎంఈవో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధికారులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి) నిజామాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన అపర్ ఐడీ జనరేషన్ అంశంపై జరిగిన జిల్లా ప్రధానోపాధ్యాయుల సమావేశంలో జక్రాన్‌పల్లి ఎంఈవో శ్రీనివాస్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఘనంగా సన్మానించారు. జిల్లాలో అపర్ ఐడీ జనరేషన్ 67 శాతం పూర్తి చేసిన సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సత్కరించారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపి, ప్రధానకార్యదర్శి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకాపూర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్‌లో సంపంగి నర్సయ్య (41) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం శుక్రవారం రాత్రి భోజనం చేసి నిద్రించిన నర్సయ్య ఉదయం లేవకపోవడంతో మృతిచెందినట్లు గుర్తించి తమ్ముడు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ హెచ్‌వో సత్యానారాయణ, ఎస్సై గోవింద్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలిం చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీజేపీ సంబరాలు



రుద్రూర్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

రుద్రూర్, ఫిబ్రవరి 08 (ఆంధ్రజ్యోతి) : నరేంద్ర మోడీ ప్రభుత్వ పథకాలే బీజేపి పార్టీని గెలిపించాయని రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలంపాటి హరికృష్ణ అన్నారు. ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో బీజేపి గెలుపొందిన సందర్భంగా శనివారం రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బీజేపి పార్టీ మండల అధ్యక్షులు ఆలంపాటి హరికృష్ణ ఆధ్వర్యంలో బీజేపి పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుతూ ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. 27 ఏళ్ల తర్వాత భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు ఏముల గజేందర్, ప్రశాంత్ గౌడ్, కటికె రామ్‌రాజ్, వడ్ల సాయినాథ్, కుమ్మరి గణేష్, శంకర్ పటేల్, బీజేపి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సంబరాలు జరిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్ గౌడ్, బందెల ఆనంద్, నాగభూషణ్, గణేష్, రాము, బాల గంగాధర్, భూషణ్, ప్రవీణ్, సాయినాథ్‌లున్నారు.

కోటగిరి :మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం పాత బస్టాండ్ వద్ద టపాకాయలు కాలుస్తూ సంబరాలు నిర్వహించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు నవీన్, మోహన్ రావు, అవగిరి రావు, శ్రీనివాస్, శ్యామల, సాయిలు పాల్గొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో బీజేపి నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో శనివారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బోట్ల విజయ్, వీరభద్రి పాల్గొన్నారు.

భీమ్‌గల్: డిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయఢంక మోగించడంతో మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం భీమ్‌గల్ పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బడాభీమ్‌గల్‌చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి బీజేపీ నాయకులు టపాకాయాలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగేశ్వర నర్సయ్య, ఆరే రవీంధర్, సంధ్యారాజ్, మహిపాల్ పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ నాయకులు సం బరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, మండల ఉపాధ్యక్షుడు కుంట శ్రీనివాస్‌రెడ్డి, జైడి గంగారెడ్డి, కోరం ప్రకాస్, చిన్నారెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ :ముప్కాల్, బాల్కొండ మండలాల్లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెండోర : బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. కార్యక్ర మంలో మార ముత్యంరెడ్డి, నోముల రవి, పురు షోత్తం, సాయిలు, ప్రసాద్, సతీష్, సంతోష్, సాగ ర్, అనిల్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఢిల్లీలాగానే బీజేపీ తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్‌చారి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, బీజేపీ మాజీ కౌన్సిలర్ పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల బీజేవైఎం ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేవైఎం నాయకులు కట్కం అరుణ్, నిశాంత్, ప్రకాష్ ఉన్నారు.

విద్యార్థులు పదిపరీక్షలు అంటే భయపడవద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పది పరీక్షలు అంటే భయపడవద్దని ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని మాతృశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ దిగంబర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మాతృశ్రీ విద్యాసంస్థల పదోతరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిప్రజ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు పరీక్షలు అంటే భయపడద్దని, ఇష్టంతో పరీక్షలు రాసి ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కిషోర్‌కుమార్, విద్యావికాస్ శ్రీనివాస్, పురాణే అజయ్, మాతృశ్రీ సుభాష్‌లతో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలు అన్ని రంగాలల్లో రాణించాలని బీహెచ్‌పీడబ్ల్యూ జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ స్వప్న అన్నారు. శనివారం బోధన్ మండలంలోని అమ్దాపూర్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు, భ్రుణహత్యల గురించి, ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాల గురించి వివరించారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా వాటిని తగ్గించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. చిన్న దశలోనే పెళ్లిళ్లు చేయడం సరికాదని, 18 సంవత్సరాలు పూర్తయిన తర్వాతనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, ప్రిన్సిపాల్ హిమబిందు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యార్థినులు రాణించాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యార్థినులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని సాలూర మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజూష అన్నారు. శనివారం సాలూర ప్రభుత్వ పాఠశాలలో బాలిక సాధికారిత, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో సైబర్‌నేరాలు పెరిగాయని వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక మోసాల నుంచి ఎలా తప్పుకోవాలో వివరించారు. మోసపూరిత ఫోన్ కాల్స్‌కు భయపడవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి తెలియజేయవద్దన్నారు. ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు, మెసెజ్‌లు ఎవరికి చెప్పవద్దన్నారు. విద్యార్థి దశలో ఇవి అలవర్చుకుంటే భవిష్యత్ తరం ఎలాంటి తప్పులు చేయకుండా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భూమయ్య, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, విజయలక్ష్మి, శోభారాణి, అరుణ్ కుమార్, విఠల్ కాంబ్లే, లక్ష్మి, అంజనా, వనజ, సాయిలున్నారు.

విధుల్లో చేరిన మధ్యాహ్నభోజన కార్మికులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన కార్మికులు తిరిగి యథావిధిగా విధుల్లో చేరారు. కొంతకాలంగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడంతో వారు నిరసన కార్యక్రమం చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య, అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. సోమవారం నుంచి యథావిధిగా విధుల్లో చేరాలని భోజన కార్మికులకు అధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జక్కం సుజాత, అశోక్, హాసిన పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో నిర్మించనున్న వెయ్యి నామాల శ్రీవేంకటేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాని కేదార్శ్వేర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగిరాములు మహరాజ్ అన్నారు. శనివారం ఆలూర్‌లో శ్రీవెంకటేశ్వర స్వామి గుట్ట వద్ద ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన స్థలంలో మంగిరాములు మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగిరాములు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఈ క్షేత్రం దేదీవ్యమానంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. భక్తులు తమకు తోచిన విధంగా ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తోర్తి మల్లేష్, స్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన సహిత, దత్తాత్రేయ, పోచమ్మ దేవి ఆలయాల శిఖర ప్రతిష్టాపన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన శనివారం విగ్రహాల ఊరేగింపు, ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యవచనం, గోపూజ, అఖండ దీప స్థాపనము, యాగశాల ప్రవేశము, అగ్ని ప్రతిష్టా, నవగ్రహ యోగిని, వాస్తు, క్షేత్రపాల, సర్వతోభద్ర, మండల దేవతా స్థాపన పూజ, జలాధివాసం, ప్రదోషకాల పూజ, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన సోమవారం విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించనున్నారు.

కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలి

వర్ని, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వకుండా పనులు చేయించడం చట్ట విరుద్ధమని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం వర్ని మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల మండల స్థాయి సమావేశం రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడుతూ గ్రామాల్లో కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి అధికారులు పనులు చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఎన్ఎస్ఎఫ్ భూములను రిజిస్ట్రేషన్ చేయాలి

సాలూర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్‌ల ద్వారా నిరుపేద లబ్దిదారులకు ప్రభుత్వం భూములు కొనుగోలు పథకం కింద కేటాయించిన భూములకు రిజిస్ట్రేషన్ చేసి న్యాయం చేయాలని మాల మహనాడు జిల్లా అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని తాలూకా రైస్‌మిల్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌ల ద్వారా గతంలో అర్హులైన వారికి భూపంపిణీ పథకంలో అందించిన ఎన్ఎస్ఎఫ్ భూములకు రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మిర్జాపూర్ సాయన్న, బాలరాజ్, సాయిలు, అబ్బయ్య, ప్రసాద్‌లున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

● కాలిపోయిన లైట్లు



స్తంభం నుంచి ఇంటి వరకు ఏర్పాటు చేసిన వైరు

మోస్రా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే చందూర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న అర్కల గోపాలరెడ్డి ఇంట్లో విద్యుత్ సదుపాయం కొరకు అధికారులను కోరగా స్తంభం నుండి ఇంట్లో మీటరుకు వైరు పెట్టగా సదుపాయం పెట్టిన వ్యక్తి రెండు వైర్లను ఫేస్ నూటల్ పెట్టకుండా రెండు ఫేస్ కనెక్షన్ పెట్టగా ఇంట్లో ఫ్యూజ్ కాలిపోగా ఉన్న బల్బులు అన్ని కాలిపోయాయని బాధితుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖ వారికి పలుమార్లు ఫోన్ చేసిన సమాధానం చెప్పలేదని చివరికి గ్రామస్థులు ఆగ్రహించి పై అధికారికి తెలుపగా వచ్చారని గ్రామస్థులు తెలిపారు.

● సమస్య పరిష్కారం చేశాం

గ్రామస్థులు సమస్య తెలియపర్చగానే లైన్ ఇన్స్‌పెక్టర్‌ను పంపి ముందు సమస్య పరిష్కారం చేశామని ఏఈ గోవింద్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు



బ్రాహ్మణపల్లి బస్‌స్టేషన్ వద్ద ప్రమాదానికి గురైన కారు (ఫైల్)



బ్రాహ్మణపల్లి శివారులో ఉన్న జాతీయ రహదారి ఇదే



రహదారి సైడ్ వద్ద రీలింగ్ నిర్మాణం చేయని దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ప్రమాదానికి పిలుపు.. ఆ జాతీయ రహదారి

● రీచ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు
● ఆందోళనలో వాహనదారులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఏ 161 రహదారి వెంట ఉన్న రీచ్‌లు ప్రమాదం ఘంటికలుగా మారాయి. ఈ రీచ్‌ల వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో రహదారి వెంటనే వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. 161 ఎన్‌హెచ్‌ఏ రహదారి కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి శివారు నుంచి నర్సింగరావుపల్లి శివారులోని నల్లవాగు మత్తడి, ఎడమ కాలువ వరకు ఉన్న రీచ్‌లా సైడ్ బారములు అధ్వానంగా మారడంతో తరచుగా లారీలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు గాల్లో కలుస్తున్నప్పటికీ ఎన్‌హెచ్‌ఏ అధికార యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుంది. బ్రాహ్మణపల్లి శివారులో నుంచి నర్సింగ్‌రావుపల్లి కూడలి వరకు ఎడమ వైపు మలుపులు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు రీలింగ్ నిర్మాణాలు చేపట్టలేకపోవడంతో ప్రమాదాలు నిలయంగా మారాయి. బ్రాహ్మణపల్లి హనుమాన్ మందిరం నుంచి కేతకి రైస్‌మిల్లు వరకు ఉన్న వంపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రీచ్‌ల వద్ద హెచ్చరిక బోర్డను కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల సర్వత నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ రహదారి వెంట ఉన్న రీచ్‌లు ప్రమాదం గంటిగా ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం ఏనాడు కూడా ఈ రీచ్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాల ఆరా తీయకపోవడం విశేషం. ఇదిలా ఉండగా బ్రాహ్మణపల్లి, మంగళూరు అచ్చంపేట గ్రామాలకు వెళ్లే రహదారికి యూ టర్న్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ గ్రామాలకు యూ టర్న్ నిర్మాణాలు చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత రహదారి అధికార యంత్రాంగం స్పందించి ఆ రీచ్‌ల వద్ద రైలింగ్ నిర్మాణాలతో పాటు గ్రామాలకు యూ టర్న్ నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాగు నీరందక రైతన్న కంట కన్నీరు

● మిర్జాపూర్‌లో ఎండుతున్న పంట పొలాలు ● చెరువు కింద పంట పొలాల రైతుల ఆవేదన
● పంట పొలాలను కాపాడాలని వేడుకోలు

జర దేఖో!!



మిర్జాపూర్‌లో ఎండిపోయిన పొలాలను చూపిస్తున్న రైతులు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్ర జ్యోతి): మండలంలో మిర్జాపూర్ గ్రామంలో పంట పొలాలను సరైన సమయంలో నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప కాలువ నీరందక గ్రామంలో ఇంచుమించు 200 ఎకరాలు వరి పంట ఎండి పోయిందని, ఆయకట్టు రైతులు వాపోతున్నారు. నిజాంసాగర్ నీటిని మండలంలోని 25వ నెంబర్ ఉప కాలువ ద్వారా నీటిని వదిలి చెరువుని నింపితే తమ కష్టాలు తీరుతాయని రైతులు చెబుతున్నారు. ఉప కాలువ నీరందక పంటలు ఎండి పోతున్నాయని, తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఇదే విషయం స్థానిక నాయకులు, సంబంధిత అధికారులకు సంప్రదించగా ఈ విషయం తమకు సంబంధం లేదని, పంట కాలువ వద్ద నీళ్ల కోసం కాపలా కాసి నీటిని కాపాడుకోవాలని, స్థానిక తహసీల్దార్ తెలిపినట్లు రైతులు వాపోతున్నారు. చెరువులో పూర్తిగా నీరు లేకపోవడంతో తూముకు నీరు అందక వరి పంట పూర్తిగా ఎండి పోయిందని వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వరిపంట పండించు కోవాలన్న సమయంలో పంటకు నీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి ఎండిపోయిన పంటకు నీరు అందేలా చూడాలన్నారు.

● నిజాంసాగర్ నీటిని నింపి రైతులను ఆదుకోవాలి



చివరి ఆయకట్టుకు నీరందేలా అధికారులు చర్యలు చేపట్టి ఎండిపోయిన పంటలను కాపాడాలి.

● శంకరప్ప, రైతు మిర్జాపూర్

● నీరందక పంటలు ఎండిపోతున్నాయి..



చెరువు కింది పంట పొలాలు నీరు అందక ఎండిపోతుఆన్నయని, అధికారులు స్పందించిన నీటిని వదిలిపెట్టి మా పంటలను కాపాడాలి.

●జంగలి శ్రీనివాస్, రైతు



అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం

కూనీపూర్‌లో వైభవంగా అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

వర్ని, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో శనివారం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మండపేటకు చెందిన పెనుమర్తి ప్రహ్లాద(నల్లూరి) ఒక ఎకరం భూమితో పాటు మూడు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. బొమ్మారెడ్డి గోపాల్ రెడ్డి ధ్వజస్తంభంకు దాతగా నిలిచారు. మొదటి రోజులో భాగంగా శాతి శుక్ల పఠనం, మూగణాధిపతి పూజ, స్వస్తి పుణ్యవచనం, రక్షాబంధనం, పంచగవ్య గోపూజ, యాగ ప్రవేశం నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తుల హారతులు, పూజల మధ్య విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు గ్రామ ప్రజలు, నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హారతులతో మహిళలు

బీఈడీ కళాశాలలో ఫీజు దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తున్న బీఈడీ కళాశాలలపై యూనివర్సిటీ వైస్‌చాన్సిలర్, రిజిస్ట్రార్‌లు స్పందించి చర్యలు తీసుకొని అఫిలియేషన్ రద్దు చేయాలని ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం వర్సిటీలోని కళాశాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలో కొనసాగుతున్న బీఈడీ కళాశాలలు విద్య పేరు మీద వ్యాపారం చేస్తున్నాయని నాణ్యమైన విద్యాబోధన అందించాల్సిన కళాశాలలు ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ఎగ్జామ్‌బ్రాంచ్ నిర్వహించిన మూడో సెమిస్టర్ ఫీజు రూ.1490, బీఈడీ కళాశాలలో 3 నుంచి 4వేల వరకు అక్రమంగా పేద విద్యార్థుల దగ్గర ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల అఫిలియేషన్ ఫీజు రిసిప్ట్ ఇవ్వకుండా ఖాళీ తెల్లపేపర్ మీద ఎగ్జామ్ ఫీజు పేరు మీద, ప్రాక్టికల్ పేరు మీద అడ్డూ అదుపు లేకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రశ్నించిన విద్యార్థులను బెదిరిస్తూ ప్రాక్టికల్‌లో ఫెయిల్ చేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని యూనివర్సిటీకి ఫీజు కట్టాలంటూ వసూలు చేస్తున్నారని ఇన్ని అక్రమాలు జరుగుతున్నా యూని వర్సిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ఫీజు పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాలలపై యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లు స్పందించి ఫీజు దోపిడిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ మోహన్, యూనివర్సిటీ వైస్ ప్రసిడెంట్ అనిల్, జాయింట్ సెక్రెటరీ సమీర్, అక్షయ్, అశోక్, లెనిన్ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగుతున్న గ్రామాలు



పడిపూజలో శివ స్వాములు



అల్పాహారం చేస్తున్న స్వాములు



గంగలో స్నానం చేసి పూజలు చేస్తున్న శివ స్వాములు (ఫైల్)

మద్నూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ చూసినా శివ నామ సర్మరణతో మారుమోగుతుంది. మొన్నటి వరకు అయ్యప్ప దీక్షలతో మళ్లీ ఇప్పుడు శివ స్వాముల దీక్షలతో గ్రామాల్లో భక్తి భావం వెల్లి విరుస్తుంది. యువకులు ముందుకు వచ్చి శివ దీక్షలు తీసుకున్నారు. మండల కాలం స్వామి వారిని పూజిస్తే తమ బాధలు తొలగి శివుని ఆశీస్సులు లభిస్తాయని శివ స్వాముల నమ్మకం. ఏటా మహా శివరాత్రికి ముందు శివ దీక్షలు తీసుకునే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. జుక్కల్ నియోజకవర్గంలో వం దలాది మంది వరకు శివ దీక్ష తీసుకున్నారు. మండల కాలం (41) దీక్ష చేస్తే శ్రేష్ఠమైనదిగా చెబుతున్నప్పటికీ అర్ధ మండలం (21) దీక్షతో పాటుగా ముందుగా వేసుకుని భక్తులు 11 రోజుల పాటు శివ దీక్ష తీసుకుంటున్నారు.

● నిబంధనలతో శివదీక్షలు

శివ దీక్షను స్వీకరించిన స్వాములు గోధుమ వర్ణం గల వస్త్రాలను ధరిస్తారు. మగవారు వయస్సుతో సంబంధం లేకుండా ఈ దీక్షను స్వీకరిస్తున్నారు. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో చన్నీటితో తలస్నానం ఆచరిస్తున్నారు. ఒక పూట భోజనం చేసి నేలపై నిద్రిస్తూ మత్తు పదార్థాలు, మాంసాహారానికి దూరంగా ఉంటూ వాటిని వదిలిపెట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

● దీక్ష విరమణ

శివరాత్రి నాటికి మండల పూజలు పూర్తి చేసుకుని శివ స్వాములు బయలుదేరే రోజు స్థానిక శివాలయంలో అర్చకులతో జ్యోతిర్ముడి కట్టించుకోవాలి. జ్యోతిర్ముడిని శిరస్సుపై ధరించి అటు శ్రీశైలా నికి ఇటు వేములవాడకు బయలుదేరుతారు. జ్యోతిర్ముడిని విప్పిన తరువాత అందులోని పూజా ద్రవ్యాలను స్వామి పూజకు సమర్పిం చాలి. ముడుపులను హుండీలో వేయాలి. మహా శివరాత్రి రోజున లింగోద్భవ సమయం అనంతరం శ్రీ స్వామి వారికి శివ దీక్ష స్వాములు అభిషేకం చేసి స్థానిక ఆలయంలో అర్చకుల నేతృత్వంలో దీక్ష విరమణ గావిస్తారు.

తాళ్ల రాంపూర్‌లో భారీ మొసలి కలకలం



ఫారెస్ట్ అధికారులు బంధించిన భారీ మొసలి

ఏర్గట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలో భారీ మొసలి కలకలం సృష్టించింది. స్థానిక రామ చెరువులో నుంచి శనివారం వేకువ జామున గ్రామంలోని పలు కాలనీల వెంబట సంచరించడంతో ఆ విషయాన్ని కమ్మర్‌పల్లి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో అక్కడి చెరుకుని వారితో పాటు జిల్లా నుండి వచ్చిన ఫారెస్ట్ అధికారులతో కలిసి భారీ మొసలిని బంధించి పట్టుకొని పై అధికారులకు సమాచారం అందించగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో మొసలిని వదిలేసినట్లు స్థానికులు తెలిపారు.

నాగేపూర్ రామాలయంలో మండల పూజ

● పాల్గొన్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



నాగేపూర్‌లో కొలువైన సీతారామ లక్ష్మణ ఆంజనేయ దేవతా మూర్తులు



యజ్ఞంలో పాల్గొన్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

నవీపేట,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్‌లోని శ్రీ రామాలయంలో శనివారం మండల పూజ నిర్వహించారు. గత డిసెంబర్ 26న గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించి 41రోజులు అయిన సందర్భంగా మండల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయంలో భక్తులకు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ప్రవచనలు అందజేశారు.

టీయూలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ బడ్జెట్‌లో విశ్వవిద్యాలయానికి 500 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని, ఇంజనీరింగ్ కళాశాలకు వర్సిటీలో శ్రీకారం చుట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. స్కాలర్‌షిప్ ఫీజు, రీయింబర్స్‌మెంట్ విడుదల కాక పోవడంతో విద్యార్థులు బిక్షం ఎత్తుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఈ విషయంలో స్పందించకుంటే ఆయన ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాజ్ కుమార్, యూనివర్సిటీ అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు పృథ్వి, నాయకులు సంతోష్, నిరంజన్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఫొటో న్యూస్



నడిపల్లి సచివాలయం వద్ద కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



ఇస్లాంపుర వద్ద



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద..



ఘన్‌పూర్ పాఠశాల వద్ద..

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఇబ్బందులు

● మృత్యువాత పడుతున్న మూగజీవాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ట్రాన్స్ కో అధికారుల నిర్లక్ష్యం, పంచాయతీ అధికారుల అలసత్వం కారణంగా చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మ ర్ల గద్దెలను ఏర్పాటు చేసిన వాటి చుట్టూ కంచె లేకపోవడంతో మూగజీవాలు మృత్యు వా త పడుతున్నాయి. గతంలో ఎన్నోమార్లు గ్రామసభల్లో ట్రాన్స్‌పార్మర్ల చుట్టూ ఇనుప కంచెలను ఏర్పా టు చేయాలని వినతులు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ సర ఫరా కారణంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నా ఇప్పటి వరకు ఎన్నోసార్లు మూగజీవాలు వాటికి తగిలి మృత్యువాత పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పాఠశాల, కళాశాలల వద్ద, పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటుచేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

'ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలి'

భిక్కనూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంఎస్ఎన్ కంపెనీపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రతిరోజూ రాత్రి కంపెనీ నుంచి దుర్వాసన వస్తుందని, ఎన్నిసార్లు ఎంఎస్ఎన్ కంపెనీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ దుర్వాసనతో గ్రామంలో ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజెల్లి భూంలింగం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్నూర్ టు నెమ్లి పాదయాత్రకు సన్నద్ధం

మద్నూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది లాగే ఈ ఏడు మద్నూర్ మండల కేంద్రం నుంచి నసురుల్లాబాద్ మండలం నెమ్లి సాయిబాబా ఆలయానికి పాదయాత్రకు ఆలయ నిర్వాహకులు సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం ఉదయం పాదయాత్ర మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి బయలుదేరుతుందని నిర్వాహకులు ప్రకాష్ వెల్లడించారు. భక్తులు సకాలంలో ఆలయానికి చేరుకుని పాదయాత్రలో పాల్గొనాలని సూచించారు. మద్నూర్ నుంచి డోంగ్లి, బీర్కూర్, నెమలి, సాయిబాబా ఆలయానికి వేలాది మంది భక్తులతో పాదయాత్ర బయలుదేరుతుందని తెలిపారు. పాదయాత్రలో భాగంగా భజన కీర్తనలతో పాటు భక్తి పాటలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పాదయాత్రలో వెళుతున్న భక్తుల కోసం ఆయా గ్రామాల్లో అల్పాహార కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



మద్నూర్ అంగన్‌వాడీ కేంద్రంలో యూనిసెఫ్ టీమ్ సభ్యులు

పిల్లలకు పౌష్టికాహారాన్ని తినిపించాలి

● అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన యూనిసెఫ్ సభ్యులు

మద్నూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారాన్ని తినిపించాలని తల్లిదండ్రులకు యూనిసెఫ్ సభ్యులు కౌన్సెలింగ్ ఇచ్చారు. యూనిసెఫ్ టీమ్ రీసెర్చ్‌లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లను యూనిసెఫ్ రీసెర్చ్ సభ్యులు పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో ఆరు నుంచి 8 నెలల పిల్లల హోమ్ విజిట్ చేసి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారని సీడీపీవో కళావతి తెలిపారు. అనుబంధ ఆహారం ఏ విధంగా ఇవ్వాలి, బాలామృతం ఏ విధంగా తినిపించాలి, పిల్లలకు పెట్టే ఆహారం ఎంత క్యాంటిటీ తినిపించాలని క్యాలెండర్ ఇచ్చారు. పిల్లల వెయిట్ ఎంత ఉంది అనేదాన్ని బట్టి వాళ్లకు పౌష్టిక ఆహారం ఇవ్వాలని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ సీడీపీవో కళావతి, సూపర్‌వైజర్ కవిత, టీమ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శిగా సురేష్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సురేష్ రాష్ట్ర కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయిలు ఇప్పటి వరకు ఇవ్వకపోవడం, ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ ప్రకారం నిధులు విడుదల చేయకుండా విద్యార్థులకు పౌష్టికాహారంకు దూరం చేయడం సరికాదన్నారు.



బస్సు ఢీకొనడంతో కిందపడిన విద్యుత్ స్తంభం

మాచారెడ్డిలో తప్పిన ప్రమాదం

మాచారెడ్డి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి బస్టాండ్‌లో శనివారం పెనుప్రమాదం తప్పింది. కామారెడ్డి నుంచి భద్రచలంకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు మాచారెడ్డి బస్టాండ్‌లో ఉన్న విద్యుత్ స్తంభానికి అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో బస్టాండ్‌లో గల విద్యుత్ స్తంభం కూలిపోయింది. విద్యుత్ స్తంభానికి విద్యుత్ తీగలు ఉన్న బస్సుకు మాత్రం తగలకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. బస్సులోని ప్రయాణికులు అందరూ బస్సు దిగి పరుగులు తీశారు. విద్యుత్ తీగలు బస్సుకు తగిలితే విద్యుత్‌షాక్‌కు గురై ప్రాణనష్టం జరిగేదని ప్రయాణికులు పేర్కొన్నారు.



స్వామి వారికి వెండి కిరీటాలు అందిస్తున్న దాతలు

స్వామి వారికి వెండి కిరీటాల అందజేత

మాచారెడ్డి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కీర్తిశేషులు పాత కిష్టయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు లక్ష్మీరాజం, పండరి, రమేష్, అశోక్‌లు సుమారు కిలో వెండితో కిరీటాలు అందించారు. అదేవిధంగా కామారెడ్డికి చెందిన పడాల సుదర్శన్‌రాజ్, విజయలక్ష్మీ దంపతులు రూ.13,001 ఆలయ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ పూజారులు, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన వెలమ వెల్ఫేర్ కార్యవర్గ సభ్యులు

వెలమ వెల్ఫేర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గండ్ర మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాజ్ గంభీర్ రావు, కోశాధికారిగా ఐలేని రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాక్షులుగా గౌరినేని మధుసూదన్‌రావు, చీటి పాండు రంగారావు, జలుగం సుజాత, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చింతలపల్లి శ్రీధర్‌రావు, గన్నమనేని వెంకట్రామారావు, చీటి పరంధాములు ఎన్నికయ్యారు. వీరందరు శనివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు లోయపల్లి నర్సింగ్‌రావు, దామోదర్‌రావు, రవీందర్‌రావు, సంజీవరావు, దేవేందర్‌రావు, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు



మద్నూర్‌లో స్వీట్లు పంచుతున్న బీజేపీ కార్యకర్తలు

మద్నూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ ఘనవిజయం సాధించడంతో మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగగా శనివారం వాటికి సంబంధించిన ఫలితాలు వెలువడ్డాయి. అందులో భారతీయ జనతాపార్టీ భారీ మెజారిటీ సాధించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం కావడంతో మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు, టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. 26 సంవత్సరాల తరువాత ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడంతో దేశంలో రాబోయే ఎన్నికల నాటికి మార్పు రానుందని నాయకులు అభిప్రాయపడ్డారు. సంబురాలలో బీజేపీ నాయకులు బాల్ కిషన్, యాదవ్ రావు, శివాజీ, నరేష్, రాజు, టైలర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట : లింగంపేట మండల కేంద్రంలో శనివారం ఢిల్లీలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపొందడంతో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా లింగంపేట మండల బీజేపీ అధ్యక్షుడు క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశంలో మోడీ చేస్తున్న అభివృద్ధికి ఢిల్లీలో బీజేపీ భారీ మెజారిటీతో గెలుపొందడమే సాక్షమని ఆయన తెలియజేశారు. తెలంగాణరాష్ట్రంలోను రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ఎల్లారెడ్డిలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సదాశివనగర్: సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాలో బీజేపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తారెడ్డి, సాయిరెడ్డి, శ్రవణ్ రావు, సాగర్, బాబు, ప్రశాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మన దేశ రాజధాని ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా బీజేపీ నసురుల్లాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో నసురుళ్లబాద్ మండల కేంద్రంలో టపకాయలు కొట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సున్నం సాయిలు మాట్లాడుతూ గత 27 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ మరియు ఆమ్ ఆద్మీ పార్టీలను మట్టికరిపించి ఘనవిజయం సాధించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చందూరి హనుమాండ్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి మేకల రామన్న యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు యాదగిరి గౌడ్, యువ మోర్చా అధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకుడు, గంగాధర్ గుప్త, అరిగే నారాయణ, పెర్క రాములు, చరణ్ యాదవ్, బూత్ అధ్యక్షులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఢిల్లీ ఎన్నికల ఫలితాలలో భారతీయ జనతా గెలుపుతో పార్టీ 27 సంవత్సరాల తర్వాత ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు అవుతున్న సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బిజెపి నాయకులు పటాకులు పేల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా బిజెపి పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే, బాలకిషన్, మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, బాల్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

భిక్కనూరు: ఢీల్లీ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ సీట్లు సాధించడం పట్ల భిక్కనూరు మండల బీజేపీ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో బీజేపీ నాయకులు బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంచారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్, బీజేవైఎం నాయకులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 27సంవత్సరాల అనంతరం ఢీల్లీలో భిజేపీ అధికారంలోకి రావడం సంతోషంగా ఉందని, కేవలం ఇది ప్రధాని మోధీతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ, బీజేవైఎం నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



సూపర్ మార్కెట్ వద్ద గుమిగూడిన బాధితులు



వస్తువులను తీసుకెళుతున్న పలువురు బాధితులు

రూ.2 కోట్లతో సూపర్ మార్కెట్ యజమాని పరారీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న మెగామార్ట్ సూపర్‌మార్కెట్ యజమాని అబిబ్ సుమారు రూ.2కోట్లతో పరారైనట్లు బాధితులు తెలిపారు. శనివారం సూపర్ మార్కెట్ వద్ద నిరసన తెలుపడంతో పాటు అప్పులు ఇచ్చిన, వస్తువులు సరఫరా చేసిన కొందరు హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్‌లు సూపర్ మార్కెట్‌లోని వస్తువులను తీసుకెళ్లిపోయారు. కొంత మంది వద్ద రూ.లక్షల్లో అప్పు చేశాడని, సూపర్ మార్కెట్‌లో పని చేసే వాళ్ల వద్ద సైతం అప్పులు తీసుకున్నాడని, వస్తువులు తీసుకుని డిస్ట్రిబ్యూటర్‌లకు రూ.లక్షల్లోనే చెల్లించకుండా గత 45 రోజులుగా షాపును మూసి వేసి పరారైనట్లు తెలిపారు. ఇప్పటికే సదరు వ్యాపారిపై స్థానిక పోలీసు స్టేషన్‌లోను ఫిర్యాదు చేశామని బాధితులు పేర్కొన్నారు. ఏది ఏమైన కామారెడ్డిలో ఇలా కోట్లలో డబ్బులు దండుకుని ఐపీలు పెడుతున్న వారు పెరిగిపోతున్నారని ఇప్పటికే 6 గురు ఈ విధంగా వ్యాపారం పేరుతో డబ్బులు, వస్తువులు తీసుకుని పరారయ్యారని ఆయా హోల్‌సేల్ వ్యాపారులు వాపోయారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

రామారెడ్డి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మాజీ జెడ్పిటిసి నారెడ్డి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామంలో బాధిత కుటుంబానికి ఉచితంగా 50 కిలోల బియ్యాన్ని పంపిణి చేశారు. గ్రామానికి చెందిన తోళ్ల మొహినుద్దీన్ కుటుంబానికి ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు నాయిని నర్సింలు, మాజీ ఎంపీటీసీలు గర్గుల్ రాజా గౌడ్, మెడికల్ రాములు, నాయకులు రాజాగౌడ్, కుమ్మరి శంకర్, ప్రసాద్, ఆంజనేయులు, రంజిత్, శేఖర్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు అధికారులకు అందజేత

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన రేషన్ కార్డుల దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎంపీఈవో ప్రభాకర్ చారి తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయితీల పరిధిలో ఇటీవల నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల్లో, గ్రామసభల అనంతరం ఇప్పటి వరకు వచ్చిన రేషన్‌కార్డుల దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయితీల వారీగా పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయితీల పరిధిలో రేషన్ కార్డులకు సంబంధించిన 1627 దరఖాస్తులు వచ్చినట్లు వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎంపీడీవో తెలిపారు.

తిప్పాపూర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

భిక్కనూరు, ఫిబ్రవరి 08 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, లింగారెడ్డి మాట్లాడుతూ బీసీలకు 46శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం, షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీసంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాచాపూర్‌లో సీసీ బెడ్ నిర్మాణ పనుల ప్రారంభం

భిక్కనూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామంలోని మార్కండేయ ఆలయం, గౌసంఘంలో శనివారం బీజేపీ నాయకులు తేలు శ్రీనివాస్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి సీసీ బెడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే రమణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు మార్కండేయ ఆలయంలో, గౌడసంఘం సీసీ బెడ్ నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయాసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు అనీల్‌కుమార్, నాయకులు శివరాజు, నర్సింలు, సంతోష్‌రెడ్డి, అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):తెలంగాణ టీచర్స్ యూనియన్(టీటీయూ) క్యాలెండర్,డైరీని శనివారం డీఈవో రాజు ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి తోడుపడాలని సూచించారు.అనంతరం టీటీయూ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు, జీపీయఫ్, టీఎస్‌జీఎల్ఐ, ఇయల్స్,సరేండర్‌బిల్లులు, గ్యాడ్యూటి బకాయిలు చెల్లించాలని, కులగణన సర్వే చేసిన ఉపాధ్యాయుల ఎన్యూమరేషన్ వెంటనే చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు హన్మంత్, శ్రీనివాస్‌లు, పర్వీన్, నాహిద్, శ్రీనివాసచారి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గాంధారి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):బాన్సువాడకు చెందిన షేక్ అహ్మద్ (32) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. తన సొంత గ్రామమైన గండివేట గ్రామానికి వచ్చి తిరిగి వెళ్తుండగా గాంధారి మండలం మొండిసడక్ వద్దఉన్న షాదుల్లా ఉసేని దర్గా వద్ద వెనుక నుంచి వస్తున్న టాటా జస్ట్ టీఎస్ 28 జీ 4383 నంబర్‌గల వాహనం ఢీకొట్టడంతో అహ్మద్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య సమ్రీనాభేగం, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రుక్మారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యం, నాయకులు భాగేష్, అసన్, పర్వతంరెడ్డి, బాలరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తాగునీటి ట్యాంకులను పరిశీలించిన ఎంపీడీవో

లింగంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని మోతె, నల్లమడుగు, నల్లమడుగుపెద్దతండాలలో శనివారం తాగునీటి ట్యాంకులను ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరిలు పరిశీలించారు. తాగునీటి ప్రత్యేక డ్రైవ్‌లో బాగంగా గ్రామాలలో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా లేదా, క్లోరినేషన్ చేస్తున్నారా అనే విషయాలతో పాటు పైపు లైన్ లికేజీలు, వచ్చే వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా తీసుకోవలసిన చర్యల గురించి వారు పంచాయితీ కార్యదర్శులకు సూచించినట్లు తెలియజేశారు.

నీటి శుద్ది యంత్రం ప్రారంభం

లింగంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోల్కంపేటలో శనివారం నీటిశుద్ది యంత్రాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి ప్రారంభించారు. గ్రామంలో శుద్ధి యంత్రం లేక ఇతర గ్రామాల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నామని, ఇతర గ్రామాల నుంచి తెచ్చుకోలేని వారు కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారని పైడి ఎల్లారెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి వెంటనే తన ట్రస్ట్ నుంచి నీటి శుద్ది యంత్రాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిలతో పాటు నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి



గొట్టిముక్కులలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న ఈవో

దోమకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో తడి, పొడి చెత్తను వెర్వేరుగా సేకరించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పనులు పరిశీలించి గ్రామాలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలని కార్యదర్శులకు ఆదేశించారు. వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తిమ్మాజీవాడిలో ఉచిత పశువైద్యశిబిరం

సదాశివనగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలం తిమ్మాజీవాడిలో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్యాధికారి రాంప్రసాద్ తెలిపారు. గేదెలు ఏవైన ఎదకురాని ఉంటే పరిక్షించి గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. లింగనిర్ధారిత వీర్యం వాడడం వలన 90శాతం ఆడదూడలు మాత్రమే జన్మిస్తాయని తెలిపారు. దీనికిగాను రైతువాటా రూ.250 చెల్లించాలని ఒకే పశువుకు వరుసగా రెండు ఎదలలో లింగ నిర్ధారిత వీర్యం వాడినచాలు కట్టకపోతే రైతవాటా రూ.500లు రైతు అకౌంట్‌కు వాపస్ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 37 గేదెలు, 24 ఆవులకు చికిత్స చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ సూపర్‌వైజర్ కృష్ణ, విజయపాలకేంద్రం అధ్యక్షుడు గంగాధర్‌రావు, పశుగణనసహాయకులు అహల్య, జుగల్‌కిషోర్, గోపాలమిత్రలు కాశిరెడ్డి,మురళి, ఇస్మాయిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

సదాశివనగర్,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా రుద్రుర్‌లోని కృషివిజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారని ప్రిన్సిపల్ రాజారెడ్డి తెలిపారు. విద్యార్థులకు హార్టికల్చర్‌లో నూతన సాగు పద్దతులు,ఆర్గానిక్ వ్యవసాయం సంబంధించిన అంశాలపైన అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. వర్మీకంపోస్టు తయారు విదానంపై వివరించామని తెలిపారు. ఆహారపదార్థాలు ఆరోగ్య గురించి తెలుసుకున్నారని,మరికొంతమంది విద్యార్థులు బోల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు.



రుద్రూర్‌లో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

సీసీ కెమెరాలను ప్రజలు వినియోగించుకోవాలి

● ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామారెడ్డి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి ఆదేశాల మేరకు రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపేట్ గ్రామంలో శనివారం ఎఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, తండాల్లో సిసి కెమెరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని సీసీ కెమెరాలతో అన్ని విషయాలు తెలుస్తాయని పలుసలహాలు, సూచనలు, పద్ద తులను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గర్గుల్ రాజా గౌడ్, నేతలు శ్రీనివాస్, గణేష్, ప్రసాద్, రాజేందర్ , మాజీ ఎంపిటిసి మెడికల్ రాములు, వివిధ రకాల రాజకీయనాయకులు, వ్యాపారులు, ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

